మారని మద్యం ప్రియుల తీరు

- మత్తులో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- జైలుకు పంపినా ఫలితం శూన్యం
- పశ్చిమ మండలం పరిధిలో మూడు నెలల్లోనే 2,766 కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లో మార్చి 19వ తేదీన తెల్లవారుజామున ఓ కారు వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టింది. బెలూన్‌లు తెరుచుకోవడం అందులో ఉన్న వారు ప్రాణాలతో బయటపడ్డారు. కారు నడుపుతున్న యువకుడు కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు కుమారుడు, బీటెక్ విద్యార్థి ప్రద్యుమ్న అని, అతడు మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. పీవీఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే నుంచి బంజారాహిల్స్ వైపు ఓ కారు అతివేగంగా దూసుకువచ్చింది. రోడ్డు నంబర్ 2లోకి రాగానే డివైడర్ ఎక్కి ఓ చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. కారు నడుపుతున్న వ్యక్తికి శ్వాస పరీక్ష చేయగా 102 రావడంతో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌గా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పబ్బుల్లో తాగి..

పశ్చిమ మండలం పరిధిలో మద్యం తాగి వాహనాలు నడపడం ఫ్యాషన్‌గా మారింది. రాత్రి కాగానే పబ్‌లోకి వెళ్లి మద్యం తాగి అదే మత్తులో కారు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం మత్తులో కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. కేవలం హిల్స్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఈ తరహా ప్రమాదాలు ప్రతి నెలా పదికి పైగానే నమోదవుతున్నాయి. ఇవన్నీ సెల్ఫ్ హిట్ కావడంతో ఇతరుల ప్రాణాలకు ఎటువంటి హానీ కలగలేదు. అయితే మత్తులో వీరు చేస్తున్న విన్యాసాలు ఎప్పటికైనా ఇతర వాహనదారులకు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉందని పోలీసులు చెబుతున్నారు.

తనిఖీలకు సహకరించకుండా..

కొందరైతే తనిఖీలకు సహకరించకుండా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై దాడులు చేస్తున్నారు. గత నెల బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లో పార్క్ హయత్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్వాసపరీక్ష కోసం కారు ఆపే ప్రయత్నం చేయగా సదరు డ్రైవర్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పారిపోయాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా, ప్రమాదానికి కారణమైన వ్యక్తికి శ్వాస పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్టు తేలింది. కేవలం మార్చి నెలలోనే ఇలాంటి ఘటనలు నాలుగు చోటు చేసుకున్నాయంటే మందుబాబులు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడకుండా ఉండేందుకు ఎంతకు తెగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

పెరుగుతున్న కేసులు..

2023తో పోల్చితే 2024లో డ్రంకెన్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున మందుబాబులు జైలుకు వెళ్లారు. చాలామంది డ్రైవింగ్ లైసెన్సులను సైతం రద్దు చేశారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ పరిధిలోకి వచ్చే ఎస్ఆర్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతేడాది 9,760 మంది మోతాదుకు మించి మద్యం తాగి పట్టుబడ్డారు. ఇందులో 8,505 మందిని న్యాయస్థానంలో హాజరుపరిచి జరిమానా విధించారు. రెండు మూడుసార్లు పట్టుబడ్డ 318 మందికి జైలు శిక్షకు పడింది. మరో 69 మంది డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేశారు. మరికొందరి వాహనాలను సీజ్ చేశారు. ఈ ఏడాది గడిచిన మూడు నెలల్లో పశ్చిమ మండలం పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 2,766 మంది పట్టుబడ్డారు. సంజీవరెడ్డినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకంగా 1,102 మంది పట్టుబడ్డారు.



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్(ఫైల్)

మద్యం తాగినప్పుడు డ్రైవర్‌ను పెట్టుకోవాలి



యువత పార్టీలకు వెళ్లడం సహజమే. కాని మద్యం తాగినప్పుడు విధిగా డ్రైవర్‌ను పెట్టుకుంటే ప్రమాదాలు జరగవు. ఇదే విషయం పదేపదే చెబుతున్నాం. కాని మత్తులో డ్రైవింగ్ చేస్తే ఆనందం వస్తుందనే ఓ పిచ్చి అపోహతో ప్రమాదాలు చేస్తున్నారు. వీరి కారణంగా తోటి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చినా చాలామందిలో మార్పు రావడం లేదు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా రోడ్లపై రెచ్చిపోతున్నారు. పోలీసులపై దాడులు చేస్తున్నారు. ఇలాంటి వారిపై ఎఫ్ఐఆర్ చేసి జైలు పంపిస్తున్నాం.

- కట్టా హరిప్రసాద్, పశ్చిమ మండలం ఏసీపీ



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

ప్రజావాణికి 244 ఫిర్యాదులు

బేగంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 244 ఫిర్యాదులు వచ్చాయి. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 53, విద్యుత్ శాఖకు 30, రెవెన్యూకు 47, హోంశాఖకు 21, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇందిరమ్మ ఇళ్ల కోసం 199, ఇతర శాఖలకు 47 అర్జీలు వచ్చినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు.



ఈద్ మిలాప్‌లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు

శాంతిని పెంచేలా పండుగలు నిర్వహించుకోవాలి

బేగంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పండుగలు ప్రజల మధ్య మంచి అనుబంధాలను పెంచేలా ఉండాలని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం రాత్రి సనత్‌నగర్‌లోని డీఎస్ఎం కాలనీలో జరిగిన ఈద్ మిలాప్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి గత నెల రోజులుగా పవిత్రమైన ఉపవాస దీక్షలతో రంజాన్ మాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ జామా మసీద్ జాఫరీ అధ్యక్షుడు సయ్యద్ నుమానుద్దీన్, ఎంఐఎం సనత్‌నగర్ ఇన్‌చార్జి మహమ్మద్ షౌకత్, డీఎస్ఎం కాలనీ వేల్ఫేర్ సొసైటీ సలహాదారుడు రియాజుద్దిన్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగ విద్యార్థులను ఆదుకోవాలి



చిన్నారులకు అన్నం వడిస్తున్న సదాశివయాదవ్, మనోహర్

ఎర్రగడ్డ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో పాటు అనాథలుగా జీవిస్తున్న విద్యార్థులకు చేతనందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని మాజీ కార్పొరేటర్లు కంజర్ల సదాశివ యాదవ్, కిలారి మనోహర్ కోరారు. శుక్రవారం మాజీ మంత్రి కె.విజయరామారావు జయంతిని పురస్కరించుకుని బబ్బుగూడలోని గానామాస్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రిగా విజయరామారావు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ప్రముఖుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా అనాథాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకురాలు కల్యాణి, స్థానిక నాయకులు కొయ్యాడ రాజ్‌కుమార్ గౌడ్, షర్మిల జాదవ్, జాకబ్, బాలాజీ గోస్వామి తదితరులు పాల్గొన్నారు.



మానసిక రోగిని బంధువులకు అప్పగిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిత, వైద్యులు

మానసిక రోగికి చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైద్యులు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి తప్పిపోయి హైదరాబాద్ వచ్చిన మానసిక రోగిని గుర్తించిన వైద్యులు రెండు నెలల పాటు చికిత్స అందించిన అనంతరం బంధువులకు అప్పగించారు. ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన మానసిక రోగి(35) రెండు నెలల క్రితం తప్పిపోయి హైదరాబాద్ చేరుకున్నాడు. భరత్‌నగర్ ఫ్లైఓవర్ కింద అపస్మారక స్థితిలో అతడిని గుర్తించిన పోలీసులు మానసిక ఆసుపత్రికి తీసుకువచ్చారు. మానసిక స్థితి సరిగా లేదని గుర్తించిన వైద్యులు రెండు నెలల పాటు చికిత్స అందించారు. అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ద్వారా విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఆస్పత్రికి చెందిన ఉద్యోగి విజయవాడ వెళ్లి వారి గురించి ఆరా తీశాడు. అతడికి తల్లిదండ్రులు లేరని తెలుసుకుని, ఇద్దరు అన్నదమ్ములకు సమాచారం ఇచ్చాడు. దీంతో శుక్రవారం వారు ఆసుపత్రికి వచ్చి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపి అతడిని తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వివాస్వన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.



శ్రీశైలంయాదవ్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించండి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ సుల్తాన్ నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర గొల్ల కురుమల హక్కుల సంఘం చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆలయంలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేష్ సాహూ, రాజు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి

- కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

బోరబండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు సీఎన్ రెడ్డి కోరారు. రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న రహదారి విస్తరణలో ఇళ్లు, ఆస్తులు కోల్పోతున్న వారితో జీహెచ్ఎంసీ సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ఎన్.ప్రసీద యూసుఫ్‌గూడ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కూడలి అభివృద్ధికి అధికారులు, నిర్వాసితులు సహకరించాలని కోరారు. తద్వారా అభివృద్ధి పనులు త్వరగా జరుగుతాయన్నారు. ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లింపు ప్రక్రియ ఆలస్యమవుతుందని, బాధితులు టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్మెంట్ రైట్స్)కు అంగీకరిస్తే పనులు త్వరగా పూర్తి చేయవచ్చని ఏసీపీ ప్రసీద పేర్కొన్నారు. దీనివల్ల ఆస్తులు కోల్పోయే వారికి సైతం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అభివృద్ధి పనుల కోసం తమ ఇళ్లు, స్థలాలు ఇవ్వడానికి అభ్యంతరం లేదని, అయితే ఆ ఇంట్లో గడిపిన స్మృతులు దూరం కావడం బాధగా ఉందని నూర్ అనే వ్యక్తి అన్నాడు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ జి.నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆస్తులు కోల్పోతున్న వారితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

అధినేతతో సమావేశం



ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ తదితరులు

- బంజారాహిల్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి)

జీపీఏ విధానంలోనే 'పది' ఫలితాలివ్వండి

- బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ విజ్ఞప్తి
- విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన సభ్యులు



పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద వినతిపత్రం చూపిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో విద్యాబోధన జీపీఏ పద్ధతిలో జరిగిందని, ఫలితాలు సైతం అదే పద్ధతిలో విడుదల చేయాలని కోరుతూ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కుల విధానంలో ఫలితాలు విడుదల చేసేందుకు ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసిన నేపథ్యంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.మల్లారెడ్డి తదితరులు కమిషనర్‌ను కలిశారు. మార్కుల పద్ధతిన ఫలితాలు ఇస్తే కార్పొరేట్ విద్యా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటాయని వారన్నారు. జీపీఏ విధానంలో 90 నుంచి 100 మార్కులు వచ్చిన వారికి 10 జీపీఏ ఇస్తున్నారని, దీనిని మార్కుల రూపంలో ఇస్తే విద్యార్థులు తీవ్ర మానసిన ఒత్తిడికి గురయ్యే ప్రమాదాలున్నాయన్నారు. రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్స్ అధికంగా ఉన్న నేపథ్యంలో తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకుని, జీపీఏ పద్ధతిన ఫలితాలు విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాసరావు సలహాదారుడు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



సూత్ర వస్త్ర ప్రదర్శనలో ఉత్పత్తులు

ఆకట్టుకుంటున్న 'సూత్ర ఇండియన్ ఫ్యాషన్' ఎక్స్‌పో

బంజారాహిల్స్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవిలో శుభకార్యాలు, వివాహాల కోసం చల్లదనంతో ఫ్యాషనబుల్‌గా ఉండే దుస్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ తాజ్ కృష్ణలో ఏర్పాటు చేసిన సూత్ర ఇండియన్ ఫ్యాషన్ ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితం అని, ఈ నెల 5 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కళ్లెం శ్రీనివాస్ రెడ్డికి గౌరవ డాక్టరేట్



కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్తగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎర్రగడ్డకు చెందిన కళ్లెం శ్రీనివాస్ రెడ్డికి అమెరికాకు చెందిన బర్లింగ్‌టన్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ మార్క్ డాక్టరేట్ తీసుకునేందుకు రావాలని ఆహ్వానించినట్లు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రపంచమంతా భయపడుతున్న సమయంలో కరోనాతో మరణించిన వారి మృతదేహాలకు, అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు చేయడంతో పాటు లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ ప్రకటించింది. ఈ నెల 20న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డికి డాక్టరేట్‌ను అందజేస్తారు. తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందిస్తున్నందుకు బర్లింగ్ టన్ స్టేట్ యూనివర్సిటీకి శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



డైరీని ఆవిష్కరిస్తున్న భట్టివిక్రమార్క

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

పంజాగుట్ట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బేగంపేటలోని క్యాంప్ కార్యాలయంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ డైరీ-2025ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్‌కు స్థలం కేటాయించాలని క్లబ్ అధ్యక్షుడు ఎల్.వేణుగోపాలనాయుడు,ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి, పాలకమండలి సభ్యులు ఉప ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం నుంచి ప్రెస్ క్లబ్‌కు, జర్నలిస్టులకు పూర్తి సహకారం అందిస్తామని భట్టి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కె.శ్రీకాంత్ రావు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు వి.బాపూరావు, బి.గోపరాజు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇంటికి, ప్రహరీ గోడ గేటుకు తాళం వేసిన దృశ్యం

నిర్మాణంలో ఉన్న ఇంటికి తాళం వేసిన అధికారులు

బోరబండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఇంటితో పాటు ప్రహరీగోడ గేటుకు జీహెచ్ఎంసీ సర్కిల్-19 అధికారులు శుక్రవారం తాళం వేశారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ వినాయక్‌నగర్‌లో సామాజిక భవనం ఎదురుగా నిర్మిస్తున్న ఇల్లు, ప్రహరీ గోడ గేటుకు పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ఎన్.ప్రసీద ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ గొట్టె నరేష్, సిబ్బంది తాళాలు వేశారు. ప్రధాన రహదారికి ఆనుకొని నిర్మిస్తున్న ఈ ఇంటిపై అనేక ఫిర్యాదులు అందాయని, యజమానిని కార్యాలయానికి రావాలని సూచించినా రాలేదని ఏసీపీ ప్రసీద తెలిపారు. నిర్మాణ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు ఆమోదం పొందలేదన్నారు. పునాది దశలోనే పనులను ఆపినా.. మళ్లీ నిర్మాణం చేపట్టారని, అందుకే తాళం వేసినట్లు ఆమె వివరించారు. కూల్చడం కానీ, సీజ్ చేయడం కానీ చేయలేదని చెప్పారు.

మంజీరా పైప్‌లైన్‌కు లీకేజీలు.. నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం రాత్రి నుంచి నీటి సరఫరాలో అంతరాయం తలెత్తింది. నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా పైప్‌లైన్‌కు ఆర్‌సీపురం, పాదర్‌స్కూల్, ఓల్డ్ ముంబై రోడ్డులో లీకేజీలు ఏర్పడడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో శుక్రవారం రాత్రి 11 గంటలకు పనులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. నీటి సరఫరా నిలిపివేయడంతో ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీ నగర్, బీరంగూడ, అమీన్‌పూర్, నిజాంపేట్‌లతో పాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో వారం రోజుల పాటు ఇబ్బందులు తలెత్తనున్నాయి.

వరద సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అధికారులను కోరిన కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు బస్తీలలో పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. శుక్రవారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాసిగూడ, అమీర్‌పేట, బల్కంపేట, బ్రాహ్మణవాడి ప్రాంతాలలో వరద నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని చోట్ల వరద నీరు వెళ్లినా బురద ఉందని, వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. బస్తీలు, కాలనీలలో వరద సహాయక పనుల్లో అధికారులకు స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో రోడ్డుపై పడిపోయిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ కథనం ప్రకారం.. తుకారాంగేట్ యుక్త టిఫిన్ సెంటర్ వద్ద శుక్రవారం గుర్తుతెలియని 32 ఏళ్ల వ్యక్తి తాగిన మైకంలో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు వైద్యులు వెల్లడించారు. తుకారాంగేట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు .మధ్యాహ్నం 2 గంట నుంచి 3 వరకు 11కెవి దుర్గానగర్ ఫీడర్ పరిధిలోని హైదరాబాద్ సెంట్రల్, ఠాకూర్ హరిప్రసాద్ మార్గ్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, పంజాగుట్ట ప్రధాన రహదారిలో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 11కెవి ఎస్.ఆర్.టి నగర్ మార్కెట్ ఫీడర్ పరిధిలోని వినాయక్‌రావు నగర్, ఎస్.ఆర్.టి మార్కెట్, భరత్‌నగర్, ఇందిరానగర్ ఫేజ్-1,రాజ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానపత్రికలు అందజేస్తున్న ఆలయాల ప్రతినిధులు

శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

మారేడుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పలువురు ఆహ్వానించారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయ పండితులు ఎమ్మెల్యే తలసానిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అదే విధంగా జెక్ కాలనీలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. మోండా డివిజన్‌లోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవానికి ఆలయ ఈఓ అన్నారావు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, నాయకులు కొలన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డిప్యూటీ ఐఓఎస్ సుమన్, ప్రధానోపాధ్యాయులు శౌరి తదితరులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నల్లగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్ డిజిటల్ స్కూల్)లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సికింద్రాబాద్ డిప్యూటీ ఐఓఎస్ సుమన్ రాథోడ్ పాఠశాలలోని యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు మించిన స్థాయిలో వేడుకలను నిర్వహించినందుకు విద్యార్థులను అభినందించారు. చిన్నారుల ఆట పాటలతో కార్యక్రమంలో ఎంతో వినోదభరితంగా జరిగింది. కార్యక్రమం చూసేందుకు వచ్చిన వారు, విద్యార్థులు ధరించిన రంగు రంగుల దుస్తులను చూసి మురిసిపోయారు.


పూజలో పాల్గొన్న పాండుయాదవ్, ఆలయ అర్చకుడు చంద్రశేఖర్‌శర్మ

దక్షిణ కేదార్‌నాథ్ ఆలయంలో స్ఫటిక లింగ ప్రతిష్ఠ

బోయినపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి ఏడబ్ల్యూహెచ్ఓ కాలనీలో దక్షిణ కేదార్‌నాథ్ ఆలయంలో స్ఫటిక లింగాన్ని ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ చైర్మన్ కల్నల్ పీవీ రమణారావు, సభ్యులు జయశంకర్, ప్రదీప్‌రావుల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన స్ఫటికలింగం, ఉమా మహేశ్వర, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వర సహిత సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో నిర్మించిన షెడ్డు కోసం రూ.5 లక్షలు విరాళం ఇచ్చిన పాండు యాదవ్‌ను ఆలయ ధర్మకర్తలు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.


టీపీసీసీ కార్యదర్శి నర్సింహన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ మహేందర్‌రెడ్డి

సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

తిరుమలగిరి ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని హనుమాన్ ఆలయంలో ఈ నెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఈఓ మహేందర్ రెడ్డి శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. కల్యాణ మహోత్సవానికి నర్సింహన్ కన్నన్ రూ. 50 వేల విరాళం అందజేశారు. రాజు, వినోద్, బాబు సుందర్, వేణుగోపాల స్వామిలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తలసానికి సీతారామ కల్యాణ ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఆలయాల ప్రతినిధులు

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానాల వెల్లువ

మారేడుపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పలు ఆహ్వానాలు అందాయి. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయ పండితులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదే విధంగా జెక్ కాలనీలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. మోండా డివిజన్‌లోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణ మహోత్సవానికి ఆలయ ఈఓ అన్నారావు ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, నాయకులు కొలన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పావురాన్ని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

తార్నాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పతంగి మాంజా ఉచ్చులో చిక్కుకుని తార్నాకలోని ఓ చెట్టు కొమ్మపై వేళాడుతున్న పావురాన్ని అగ్నిమాపక సిబ్బంది రక్షించి మానవత్వాన్ని చాటుకున్నారు. తార్నాకలోని వాటర్ వర్క్స్ కార్యాలయం సమీపంలో శుక్రవారం ఒక భారీ చెట్టు కొమ్మకు పతంగి మాంజా ధారం ఉచ్చులో చిక్కుకుని ఓ పావురం వేలాడుతోంది. దానిని గమనించిన జానారెడ్డి అనే వ్యక్తి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కర్ర సహాయంతో పావురాన్ని కిందికి దించి కాళ్లకు చుట్టుకున్న మాంజాను తొలగించారు. కొద్ది సేపటికి తేరుకున్న ఆ పావురాన్ని గాల్లోకి ఎగురవేశారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేయడంతో పాటు, అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


పావురం కాళ్లకు చిక్కుకున్న మాంజాను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లింగంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌గా రవిబాబు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ డివిజన్ లింగంపల్లి ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రవి బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ జీఆర్పీ కానిస్టేబుళ్లు కొత్త సీఐ రవి బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు


ఇన్‌స్పెక్టర్‌గా రవిబాబును అభినందిస్తున్న జీఆర్పీ కానిస్టేబుళ్లు

రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలు

● రాకపోకలకు జనాల అవస్థలు

● అడ్డగుట్టలో పరిస్థితి ఇదీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. వర్షం అధికంగా కురవడంతో గల్లీల్లో ఎక్కడికక్కడ ఇసుక, మట్టి కుప్పలు పేరుకుపోయాయి. దాదాపు 40 ఇళ్లలో వర్షం నీరు చేరడంతో బస్తీవాసులు బయటికి రాని పరిస్థితి నెలకొంది. ఇళ్ల ముందు పేరుకుపోయిన మట్టి కుప్పల కారణంగా బస్తీవాసులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నుంచి చెత్త, మట్టిని వెంటనే తొలగించాలని అధికారులను స్థానికులు కోరారు.

ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీలో...

ఐదు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీ నీటితో చెరువులా మారడంతో బస్తీవాసులు ఇళ్ల నుంచి అడుగు బయట పెట్టేందుకు భయపడ్డారు. బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ సరిగ్గా లేకపోవడం, మోకాలు లోతు వర్షం నీరు నిలిచింది. తుకారాం గేట్ మరాఠ బస్తీ, ఎంసీసీహెచ్ క్వార్టర్, వెంకట్‌నగర్, శాస్త్రీనగర్ వంటి ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలో మట్టి నిండిపోయి వర్షం నీరు బయటికి వెళ్లకపోవడంతో బస్తీవాసులు నరకం అనుభవించారు.


అడ్డగుట్ట మసీద్ వెనుక భాగంలో మట్టి కుప్పలు

మా బతుకులు మారవా?

● పేరుకుపోయిన మురుగునీరు, బురద, చెత్తాచెదారం

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న న్యూఅశోక్‌నగర్ బస్తీవాసులు


న్యూఅశోక్‌నగర్‌లోని బస్తీలో మురుగు నీరు


బురద చెత్తాచెదారం

బౌద్ధనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఐదేళ్లుగా తమ బతుకులు మారడం లేదని సికింద్రాబాద్ నియోజకవర్గ బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూఅశోక్‌నగర్ బస్తీవాసులు వాపోతున్నారు. నాలా పరివాహక ప్రాంతంలో తాము జీవిస్తుండడం తప్పా అని వారు ప్రశ్నిస్తున్నారు. న్యూఅశోక్‌నగర్‌ను అభివృద్ధి చేయటంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని, తాము ఇబ్బందులు పడుతున్నా కనీసం పలకరించే నాయకులు, అధికారులు లేకపోవటం తమ దురదృష్టమని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో న్యూఅశోక్‌నగర్‌లో బస్తీ ముంపునకు గురైంది. మురికినీటితోపాటు బురద, చెత్తాచెదారం, కవర్లతో ఆ బస్తీ అంతా నిండిపోయింది. దీంతో ఇళ్లలోని వారు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. చెత్తాచెదారం వల్ల దుర్వాసన వస్తోందని, దోమలు పెరిగిపోయి విపరీతంగా కుడుతున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. శుక్రవారం కనీసం అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బస్తీవైపు కన్నెత్తి చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్తీలో పేరుకుపోయిన బురద, చెత్తాచెదారాన్ని తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

జలమండలి నిర్లక్ష్యం..

తాగునీరు రోడ్డు పాలు

బౌద్ధనగర్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): వేసవికాలం.. తాగునీటికి ఇబ్బంది పడుతున్న జనం.. ఇలాంటి సమయంలో కూడా జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల శుక్రవారం మధ్యాహ్నం సీతాఫల్‌మండిలో తాగునీరు రోడ్డుపై వృథాగా పోయింది. సీతాఫల్‌మండి శివాజీ విగ్రహం వద్ద ఉన్న మంచినీటి వాల్వ్‌కు రెండురోజుల క్రితం జలమండలి సిబ్బంది మరమ్మతులు చేశారు. సక్రమంగా మరమ్మతులు చేయకపోవడంతో శుక్రవారం వాల్వ్ నుంచి భారీగా మంచినీరు లీకై రోడ్డుపై భారీగా నిలిచిపోయింది. స్థానికులు జలమండలి కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ఆ మార్గంలో తాగునీటి సరఫరాను నిలిపివేసి సిబ్బంది వాల్వ్‌కు మరమ్మత్తులు చేపట్టారు.


సీతాఫల్‌మండిలో వృథాగా పోతున్న తాగునీరు


మహాకుంభాభిషేకం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ నర్సారెడ్డి తదితరులు

పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో

7 నుంచి మహాకుంభాభిషేకం

రెజిమెంటల్‌బజార్,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శివాజీనగర్‌లోని పెరుమాళ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహా కుంభాభిషేక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వై.నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవాలయంలో ఆలయ ఈఓ కేబీ సత్యమూర్తి కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 200 ఏళ్ల పైబడిన చరిత్ర కలిగిన ఆలయ జీర్ణోద్ధరణను ఏడాదిన్నర క్రితం చేపట్టామన్నారు. ఈ పనులు పూర్తి కావడంతో 7వ తేదీ నుంచి వివిధ రకాల పూజలు జరుగుతాయని, 11వ తేదీ ఉదయం 9.15 నుంచి 9.45 వరకు మహా కుంభాభిషేక కార్యక్రమం జరుగుతుందన్నారు. రామానుజ పెద జీయర్ స్వామి, తిరుమల, తిరుపతి గోవింద రామానుజ చిన జీయర్ స్వామిల ఆధ్వర్యంలో ఈ పూజలు జరుగుతాయని, తిరుమల, తిరుపతి ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు పాల్గొంటారన్నారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు హాజరవుతారని తెలిపారు. సొంత నిధులు, దాతల సహకారంతో ఆలయ జీర్ణోద్ధరణకు కృషి చేసిన చైర్మన్ నర్సారెడ్డిని ఈఓ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరేందర్‌రెడ్డి, నరేశ్, సురేశ్‌కుమార్, రాయి వెంకటేశ్, గోవిందన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, ప్రధానోపాధ్యాయుడు తదితరులు

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూళ్లను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. చిలకలగూడ దూద్‌బావి ప్రైమరీ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరానికి ప్రవేశ కరపత్రాలను శుక్రవారం తన నివాసంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ స్కూళ్లలో వివిధ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ పేద విద్యార్థులకు ఉపకరించేలా జూనియర్, డిగ్రీ కాలేజీలను సాధించుకున్నామని తెలిపారు. కొత్తభవనాల నిర్మాణానికి సైతం చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు

● మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రచార కరపత్రాలను దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియంలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ప్రారంభిస్తున్నారని, మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు లోపు వారు అర్హులని అన్నారు. పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు అందజేయడంతోపాటు ఆట, పాటల్లో తర్ఫీదు ఇస్తారని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె సూచించారు.

వరద సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● అధికారులను కోరిన కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు బస్తీలలో పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. శుక్రవారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాసిగూడ, అమీర్‌పేట, బల్కంపేట, బ్రాహ్మణవాడి ప్రాంతాలలో వరద నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని చోట్ల వరద నీరు వెళ్లినా బురద ఉందని, వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. బస్తీలు, కాలనీలలో వరద సహాయక పనుల్లో అధికారులకు స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని పిలుపునిచ్చారు.

బొల్లారంలో బస్ షెల్టర్ ప్రారంభం

తిరుమలగిరి ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బొల్లారం చెక్‌పోస్టు వద్ద మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను శుక్రవారం నార్త్ డిస్ట్రిక్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ.. ప్రయాణికులకు బస్‌షెల్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రోడ్డుపై ఎండలో నిలబడకుండా బస్ షెల్టర్‌లో వేచి ఉండొచ్చన్నారు. సిటీలో ఉన్న బస్ షెల్టర్లను ప్రయాణికులు ఉపయోగించుకోకుండా రోడ్లపై నిల్చుంటున్నారని, దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది కలుగుతోందని, ఒక్కోసారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల ప్రయాణికులు బస్ షెల్టర్‌ను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బస్‌లో ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేయకూడదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మార్పు ఫౌండేషన్ వారు ముందుముందు ఇలాంటి ప్రజాపయోగ కార్యక్రమాలు మరెన్నో చేయాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబు, ఎస్‌ఐ శ్రీకాంత్, డిపో మేనేజర్ భవభూతి, మార్పు ఫౌండేషన్ ఫౌండర్ రఘువంశి, కో ఫౌండర్ రామవైష్ణవి, కిరణ్, జోసఫ్ పాల్గొన్నారు.


బస్ షెల్టర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కమీషన్ ఏజెంట్లను రెచ్చగొడుతున్న దేవేందర్ రెడ్డి

● బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరు ఆనంద్‌బాబు

బోయినపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ గార్డు చరణ్‌పై దాడి చేయడం ఏంటని అడిగినందుకే బోయినపల్లి మార్కెట్ యార్డ్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని బోయినపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ రాగిరు ఆనంద్‌బాబు అన్నారు. వైస్ చైర్మన్ దేవేందర్, మార్కెట్ యార్డు సెక్రటరీ వెంకన్న, పాలక మండలి సభ్యులతో కలిసి శుక్రవారం చైర్మన్ రాగిరు ఆనంద్ బాబు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేవేందర్ మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్లను రెచ్చగొట్టి రైతులకు నష్టం జరిగేలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఈ విషయమై మార్కెటింగ్ శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపిచినట్లు తెలిపారు. బాధితుడు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఆనంద్ బాబు వెల్లడించారు.

కమీషన్ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడిపై కేసు నమోదు

తిరుమలగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వ్యవసాయ మార్కెట్ కూరగాయల కమీషన్ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి పై తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ దేవేందర్ రెడ్డి మార్కెట్ యార్డ్‌లోని గెస్ట్ పార్కింగ్‌లో గత కొంత కాలంగా కార్ పార్కింగ్ చేస్తున్నాడు. అయితే మార్కెట్ యార్డ్ ఆదేశాల మేరకు గెస్ట్‌పార్కింగ్‌లో కార్ పార్క్ చేయవద్దని మార్కెట్ యార్డ్‌లో చీఫ్ సెక్యూరిటీ పండు గోటి చరణ్ తేజ వారించాడు. దీంతో కోపోద్రిక్తుడైన సోమ దేవేందర్ రెడ్డి అతనిని దూషించాడు. చరణ్ తేజ తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుజరాత్ బయలుదేరిన కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే కాంగ్రెస్ పార్టీ ప్లీనరీకి సికింద్రాబాద్ నుంచి పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత, సికింద్రాబాద్ ఇన్‌చార్జి రామలీలతో కలిసి శుక్రవారం విమానంలో బయల్దేరి వెళ్లారు. ప్లీనరీలో చర్చించిన విషయా లను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తామని సంగీత తెలిపారు.


గుజరాత్‌కు బయలుదేరిన సంగీత, రామలీల


ఆలయ నిర్వాహకులతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ అనుదీప్

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

● ఇన్‌స్పెక్టర్ అనుదీప్

బౌద్ధనగర్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మతసామరస్యం, శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కోరారు. శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఆలయ నిర్వాహకులు, సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించే కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాటు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. శ్రీరామనవమి వేడుకలను సుమారు 200 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని 13 ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం, 11 ప్రాంతాల్లో శోభాయాత్ర, ర్యాలీలకు దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్లు, నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం . మౌలాలి- చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య వరంగల్‌కు చెందిన మాదారపు లత (30) శుక్రవారం మౌలాలి నుంచి చర్లపల్లి వైపు వెళ్తున్న రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి బ్యాగులో ఆధార్ కార్డు లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, పోస్టుమార్టం మార్టం అనంతరం వారికి అప్పగిస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో న్యూసెన్స్.. డ్రైవర్‌కు ఐదు రోజుల జైలు

బౌద్ధనగర్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి న్యూసెన్స్ చేయడంతో పాటు పోలీస్ కంట్రోల్‌కు తప్పుడు కాల్ చేసిన ఓ డ్రైవర్‌కు కోర్టు ఐదు రోజులు జైలుశిక్ష విధించింది. ఎస్సై మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం .. వారాసిగూడ అంబర్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ హక్(38) ఉబర్ డ్రైవర్. పీకల దాకా మద్యం తాగిన హక్ బుధవారం రాత్రి అంబర్‌నగర్‌లో ప్రజలను తి డుతూ, భయభ్రాంతులకు గురిచేస్తూ నానా హంగామా సృష్టించాడు. అంతేకాకుండా 100 డయల్ తప్పుడు కాల్ చేశాడు. ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు అబ్దుల్ హక్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం ఉదయం సికింద్రాబాద్‌లోని 15వ మెట్రోపాలిటన్ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి ఐదురోజులు పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.


అబ్దుల్ హక్

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో రోడ్డుపై పడిపోయిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ కథనం ప్రకారం.. తుకారాంగేట్ యుక్త టిఫిన్ సెంటర్ వద్ద శుక్రవారం గుర్తుతెలియని 32 ఏళ్ల వ్యక్తి తాగిన మైకంలో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. తుకారాంగేట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం